# సోలార్ ప్యానెల్స్‌కు చెల్లు!

- జపాన్‌లో 'పెరోవ్‌స్కైట్' ప్యానల్స్ అందుబాటులోకి..
- ఏకబిగిన 30 ఏండ్లపాటు లైటింగ్.. ధర కూడా తక్కువ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)


హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): పర్యావరణానికి హాని చేయకుండా కరెంటును ఉత్పత్తి చేసేవిగా పేరొందిన సోలార్ ప్యానెల్స్ భవిష్యత్తులో ఇకపై కనిపించకపోవచ్చు. జపాన్‌లో ఇప్పటికే వీటి వాడకాన్ని తగ్గించేశారు. సంప్రదాయ సోలార్ ప్యానెల్స్ స్థానంలో పెరోవ్‌స్కైట్ అనే కొత్త ప్యానెల్స్‌ను తీసుకొచ్చారు. తక్కువ ధరలో ఎక్కువ కరెంటు ఉత్పాదకతే లక్ష్యంగా వీటిని తీసుకొచ్చినట్టు పరిశోధకులు చెప్తున్నారు.

**ఏమిటీ 'పెరోవ్‌స్కైట్ ప్యానెల్స్'?**

సోలార్ ప్యానెల్స్ సాధారణంగా సిలికాన్ మెటీరియల్‌తో తయారు చేస్తారు. అయితే పెరోవ్‌స్కైట్ ప్యానెల్స్‌ను కాల్షియమ్ టైటానేట్ అనే మెటీరియల్‌తో తయారు చేస్తారు. ఇదీ సెమీకండక్టర్. వెలుతురిని గ్రహించి దాని తీవ్రతను రెట్టింపు చేయడమే కాదు ప్రత్యేక కెపాసిటర్లలో ఎక్కువకాలం స్టోర్ చేసుకొనే సదుపాయమూ దీంట్లో ఉన్నది. 30 ఏండ్లపాటు ఏకబిగిన కరెంటును ఉత్పత్తి చేసే ఈ పెరోవ్‌స్కైట్ ప్యానెల్స్ ధర.. సంప్రదాయ సోలార్ ప్యానెల్స్ కంటే ఎంతో తక్కువ.

**'సోలార్ ప్యానెల్స్' కంటే ఎలా మెరుగు??**

రెండు గదుల ఇంట్లో ఉండే ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, నాలుగు ఫ్యాన్లు, ఐదు బల్బులకు విద్యుత్తును సరఫరా చేయాలంటే 2కిలో వాట్ సోలార్ ప్యానెల్ అవసరం. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని కలుపుకొన్నప్పటికీ దీని కొనుగోలుకు రూ. 60 వేలు ఖర్చు చేయాలి. సూర్యకాంతి ఉన్నప్పుడే ఇవి పని చేస్తాయి. స్టోరేజీ ప్రాబ్లమ్స్ ఉన్నాయి. వీటిని అమర్చడానికి ప్రత్యేకంగా ఇంటి పైకప్పు అవసరం. రాళ్లవాన, పిడుగులు పడినప్పుడు నాశనమయ్యే ప్రమాదం ఉన్నది. అయితే, పెరోవ్‌స్కైట్ ప్యానెల్స్‌లో ఈ సమస్యలు లేవు. వీటి ధర చాలా తక్కువ. ఎనర్జీ స్టోరేజీ ప్రాబ్లమ్స్ లేవు. ఇంటి పైకప్పు మీదనే అమర్చాల్సిన అవసరం లేదు. వెలుతురు పడే ఎక్కడైనా బిగించవచ్చు. కాల్షియమ్ టైటానేట్‌తో తయారైన ప్రత్యేక ఫిల్మ్ ఎంతో ధృడమైనది. రాళ్ల వానవంటివి ఈ ప్యానెల్స్‌ను నాశనం చేయలేవని పరిశోధకుల అభిప్రాయం. రష్యాలోని కొన్ని నగరాల్లోనూ ఈ తరహా ప్యానెల్స్ వినియోగం పెరిగినట్టు నిపుణులు చెప్తున్నారు.





అట్టారి సరిహద్దువద్ద రైతుల ట్రాక్టర్ ర్యాలీ

# అన్నదాతల ట్రాక్టర్ మార్చ్

## పంజాబ్, హర్యానాలో కదం తొక్కిన రైతులు

అమృత్‌సర్, హోషియాపూర్, ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లోని చాలా ప్రాంతాల్లో రైతులు ట్రాక్టర్ మార్చ్ నిర్వహించారు. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతోపాటు తమ డిమాండ్లను పరిష్కరించాలని వారు కేంద్రాన్ని కోరారు. సంయుక్త కిసాన్ మోర్చా(రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా తదితర రైతు సంఘాలు ఈ మార్చ్‌ను నిర్వహించాయి. అమృత్‌సర్‌లో జాతీయ జెండాలను అలంకరించిన 600 ట్రాక్టర్లతో రైతులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. రైతు నాయకుడు సర్వణ్ సింగ్ పంధేర్ నేతృత్వంలో 30 కిలోమీటర్ల మేర ఈ ర్యాలీ సాగింది. తమ డిమాండ్లు నెరవేరే వరకు శంభు, ఖన్నూరి వద్ద తమ నిరసనలను కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు. ఢిల్లీ చలో మార్చ్ జరిగి 200 రోజులు పూర్తయ్యే సందర్భంగా ఈ నెల 31న శంభు, ఖన్నూరి సరిహద్దుల్లో మహా పంచాయత్‌లు నిర్వహిస్తామని తెలిపారు.

# నేడే ఎస్ఎస్ఎల్వీ డీ3 ప్రయోగం

శ్రీహరికోట, ఆగస్టు 15: చిన్న చిన్న శాటిలైట్లను అభివృద్ధి చేయటం, అందుకు అనుకూలమైన పేలోడ్ పరికరాలను రూపొందించే లక్ష్యంలో భాగంగా ఇస్రో చేపట్టిన 'ఎస్ఎస్ఎల్వీ-డీ3' మిషన్ రాకెట్ ప్రయోగానికి సర్వం సిద్ధమైంది. శుక్రవారం శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఉదయం 9.19 గంటలకు ప్రయోగిస్తున్న రాకెట్ కౌంట్‌డౌన్ మొదలైంది. 'ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్' ఈవోఎస్-08ను తక్కువ ఎత్తులోని భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టడం ఈ మిషన్ లక్ష్యం. దాదాపు 6 నెలల తర్వాత ఇస్రో చేపడుతున్న రాకెట్ ప్రయోగమిది. కేవలం రెండు రోజుల ప్రణాళికతో చిన్న చిన్న శాటిలైట్స్‌ను తక్కువ ఖర్చుతో భూ కక్ష్యలోకి చేర్చేందుకు ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్‌తో సాధ్యమవుతుందని ఇస్రో మాజీ సైంటిస్టు ఒకరు చెప్పారు.

# 12 రోజులు డిజిటల్ అరెస్ట్

## ఐఐటీ ప్రొఫెసర్‌కు 12 లక్షలు టోకరా

జైపూర్: మనీ లాండరింగ్ కేసు పేరుతో ఐఐటీ జోధ్‌పూర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను(35) మోసగించిన సైబర్ నేరగాళ్లు ఆమెను 12 రోజుల పాటు డిజిటల్ అరెస్ట్ చేసి సుమారు రూ.12 లక్షలను దోచుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. బాధితురాలి పేరుతో ముంబైకు డ్రగ్స్‌తో కూడిన పార్సిల్ వచ్చిందని.. అందులో చాలా పాస్‌పోర్ట్‌లు, క్రెడిట్ కార్డులు ఉన్నాయని బెదిరించిన నేరగాళ్లు ఆమెను తమ పర్యవేక్షణలో ఉండాలని.. లేదంటే అరెస్ట్ చేయక తప్పదని బెదిరించి ఈ మోసానికి పాల్పడ్డారు. బాధితురాలికి ఈ నెల 1న వేర్వేరు ఫోన్ నెంబర్ల నుంచి ఈ బెదిరింపు కాల్స్ వచ్చాయి. దీంతో భయపడిన బాధితురాలు వారు చెప్పినట్టు చేస్తూ వచ్చారు. నేరగాళ్లు ఆమె ఫోన్‌లో కెమెరాను ఆన్‌లో ఉంచి ఆమెను నిరంతరం పర్యవేక్షించారు. ఫోన్ స్క్రీన్ షేర్ చేయించుకొని ఆమె ఫోన్‌ను నియంత్రణలోకి తీసుకొన్నారు. స్కైప్ యాప్ ద్వారా ఆమె ల్యాప్‌ట్యాప్‌నూ నియంత్రించారు. దీంతో ఆమె ఎవరినీ సంప్రదించలేక పోయారు. పది రోజుల తర్వాత ఆమె బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకొన్న నేరగాళ్లు మంగళవారం సుమారు రూ.12 లక్షలను చెక్ ద్వారా ఆర్టీజీఎస్ విధానంలో బదిలీ చేయించుకున్నారు. ఆ తర్వాత బాధితురాలి ఫోన్, ల్యాప్‌ట్యాప్‌పై తమ యాక్సెస్ తొలిగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

## వారానికో రోజు ఆఫీసుకొస్తే..

# ఇలాగే వెనుకబడతాం

## ఏఐ రేసుపై గూగుల్ ఇకనైనా దృష్టిసారించాలి: మాజీ సీఈవో ఎరిక్



న్యూఢిల్లీ, ఆగస్టు 15: అంతర్జాతీయ ఐటీ దిగ్గజం గూగుల్‌లో 'వర్క్ ఫ్రం హోం' విధానాన్ని కొనసాగించడంపై ఆ సంస్థ మాజీ సీఈవో ఎరిక్ స్మిత్ విమర్శలు గుప్పించారు. ఓపెన్ ఏఐ లాంటి స్టార్టప్‌లతో పోలిస్తే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రేసులో గూగుల్ చాలా వెనుకబడిపోయిందని, 'వర్క్ ఫ్రం హోం' విధానం, ఉద్యోగులు వారానికి ఒక రోజు మాత్రమే ఆఫీసుకు రావడమే ఇందుకు ముఖ్య కారణమని పేర్కొన్నారు. ఇటీవల స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో జరిగిన ఓ చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ జీవితాన్ని సమతూకంగా ఉంచాలని గూగుల్ నిర్ణయించిందని, ఉద్యోగులు గెలవడం కంటే త్వరగా ఇంటికి వెళ్లడం, ఇంటి నుంచి పనిచేయడం చాలా ముఖ్యమైపోయిందని అన్నారు. ఈ మార్పు గూగుల్‌కు ప్రతికూలంగా మారిందని, మిగతా టెక్ కంపెనీల్లో ఉద్యోగులు గంటల తరబడి గొడ్డుచాకిరీ చేస్తూ కొత్త ఆవిష్కరణలతో గూగుల్‌కు పోటీ ఇస్తున్నారని చెప్పుకొచ్చారు. ఏఐ రేసులో వెనుకబడటంపై గూగుల్ ఇప్పటికైనా దృష్టి సారించాల్సిన అవసరమున్నదని స్పష్టం చేశారు.

# సామాజిక మాధ్యమాలపై దావా

## ప్రజలను వ్యసనపరులుగా మారుస్తున్నాయని ఆరోపణ

టొరంటో: ప్రస్తుతం సమాజంలో చాలా మంది సామాజిక మాధ్యమాలకు బానిసలుగా మారిపోతున్నారు.కెనడాలోని మాంట్రియల్‌కు చెందిన ఒక యువకుడు వీటిపై చర్య కోరుతూ న్యాయస్థానంలో దావా వేశాడు. టిక్ టాక్, యూట్యూబ్, రెడ్డిట్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లపై తీవ్ర ఆరోపణలు చేశాడు. వ్యసనపరులుగా మార్చడమే కాక, వాటి కారణంగా పౌరుల మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతున్నదని ఆరోపించాడు. 2015 నుంచి తాను సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్నానని, వీటి వల్ల ఉత్పాదకత, శరీరంలో పలు సమస్యలు ఏర్పడ్డాయని ఆరోపించాడు.


# 3 లక్షలమంది డాటా గల్లంతు

## గూగుల్ క్రోమ్, మైక్రోసాఫ్ట్ యూజర్లకు హ్యాకర్ల దెబ్బ

న్యూఢిల్లీ: ప్రముఖ సెర్చ్ ఇంజిన్ గూగుల్ క్రోమ్, మైక్రోసాఫ్ట్ ఎడ్జ్ యూజర్లను హ్యాకర్లు టార్గెట్ చేసుకున్నారని, ఫేక్ బ్రౌజర్ ఎక్స్‌టెన్షన్లతో యూజర్ల కంప్యూటర్లలో మాల్‌వేర్‌ను ప్రవేశపెడుతున్నారని పరిశోధకులు తాజాగా హెచ్చరించారు. ప్రమాదకర ఎక్స్‌టెన్షన్లను డౌన్‌లోడ్ చేసుకోవటం ద్వారా దాదాపు 3లక్షలకు పైగా గూగుల్ క్రోమ్, మైక్రోసాఫ్ట్ యూజర్ల కంప్యూటర్లు ప్రభావితమయ్యాయని సైబర్ సెక్యూరిటీ కంపెనీ 'రీజన్‌ల్యాబ్స్' తాజా నివేదిక పేర్కొన్నది. దీంతో యూజర్ల వ్యక్తిగత డాటా, ఆర్థిక సమాచారం, పాస్‌వర్డ్‌లు హ్యాకర్ల చేతికి చిక్కాయని నివేదిక తెలిపింది. ప్రమాదకర ఎక్స్‌టెన్షన్లతో హ్యాకర్లు మరిన్ని దాడులు జరపవచ్చునని హెచ్చరించింది.

# ఎమ్మెల్యేల నారాజ్ ?

- జెండా ఆవిష్కరణలో దక్కని గౌరవం
- కార్పొరేషన్ చైర్మన్లకే సర్కారు పెద్దపీట
- వేడుకలకు ముఖం చాటేసిన ఎమ్మెల్యేలు
- శాసనసభ్యుల గైర్హాజరుపై ఉమ్మడి జిల్లాలో చర్చ
- ప్రసంగం మధ్యలోనే వెనుదిరిగిన బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు



నిజామాబాద్, ఆగస్టు 15(నమస్తే తెలంగాణ ప్రతినిధి): పంద్రాగస్టు వేడుకల్లో గౌరవ వందన స్వీకారోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పలువురిలో అసంతృప్తిని రగిల్చింది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఒకింత నారాజ్ అయినట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏటా స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రభుత్వంలో క్యాబినెట్ ర్యాంక్ కలిగిన ప్రజా ప్రతినిధులు, ఎగువ సభ సభ్యులు, ప్రభుత్వ విప్‌లు, ప్రభుత్వంలో వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర హోదా కలిగిన వారికి జెండా ఎగురవేసే అవకాశం దక్కుతుంది. ఈ మహత్తర అవకాశం ప్రధానంగా సంబంధిత ఉమ్మడి జిల్లాకు చెందిన నేతలకే లభించడం సర్వసాధారణంగా జరిగే ప్రక్రియ. 78వ స్వాతంత్ర్య దినోత్సవం వేళా ఉమ్మడి జిల్లాలో ఈ వరుస క్రమం తప్పినట్లుగా కనిపించింది. సీనియర్ శాసనసభ్యులను పక్కన పెట్టి కార్పొరేషన్ చైర్మన్లకు జెండా ఎగురవేసే అవకాశం రావడంతో పలువురు నొచ్చుకున్నట్లుగా తెలుస్తున్నది. ఇందులో భాగంగానే జెండా వందనానికే ముఖం చాటేసినట్లుగా తెలుస్తున్నది. కామారెడ్డిలో వేరే జిల్లాకు చెందిన వ్యక్తికి అవకాశం ఇచ్చి ఇదే ప్రాంతానికి చెందిన షబ్బీర్ అలీకి వేరే జిల్లా కేటాయించడంపైనా చర్చ నడుస్తున్నది.

**మన వాళ్లకు మొండిచేయి...**

ప్రభుత్వ సలహాదారుగా కొనసాగుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీకి సర్కారు గుర్తింపును ఇచ్చింది. ఎమ్మెల్యేగా ఓడిన తర్వాత సలహాదారుగా పదవిని దక్కించుకున్న షబ్బీర్ అలీని ఆదిలాబాద్‌లో జరిగే పంద్రాగస్టు వేడుకల్లో ముఖ్య అతిథిగా ప్రభుత్వం పంపింది. ప్రభుత్వంతో అనుసంధానకర్తగా ఉమ్మడి జిల్లాకు పెద్దదిక్కుగా ఉన్న షబ్బీర్‌ను అనూహ్యంగా వేరే జిల్లాలో జరిగే పంద్రాగస్టు వేడుకలకు ప్రభుత్వం పంపడంపైనా కాంగ్రెస్ వర్గీయుల్లో విస్మయం కలుగుతున్నది. ఆయన స్వస్థలంలో కామారెడ్డి జిల్లాలో జెండా ఎగురవేస్తారని అంతా ఆశించగా వేరే జిల్లాకు చెందిన వ్యక్తికి అవకాశం దక్కింది. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఉన్న పటేల్ రమేశ్ రెడ్డికి కామారెడ్డిలో జెండా ఆవిష్కరణ చేసే అదృష్టం వరించింది. కామారెడ్డిలో కాంగ్రెస్ నుంచి ఇద్దరు కొత్త ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతారావు, మదన్ మోహన్‌రావు తోపాటు తాజాగా కాంగ్రెస్ పార్టీలో చేరిన సీనియర్ శాసనసభ్యుడు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి సైతం ఉన్నారు. వీరికి తోడుగా ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు అందుబాటులోనే ఉన్నప్పటికీ జెండా ఆవిష్కరణకు నోచుకోలేక పోయారు. ఉమ్మడి జిల్లాలో నలుగురు కార్పొరేషన్ చైర్మన్లు ఉండగా ఈరవత్రి అనిల్‌కు అవకాశం దక్కింది. అన్వేశ్ రెడ్డి, మానాల మోహన్ రెడ్డిలకు మొండి చేయి తప్పలేదు.

**అదృష్టంగా భావిస్తున్నా...**

78వ స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా నిజామాబాద్ జిల్లాలో జెండా ఎగురవేసే అవకాశం దక్కడంపై ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ హర్షం వ్యక్తంచేశారు. ఈ సదావకాశాన్ని గొప్ప గౌరవంగా, అదృష్టంగా భావిస్తున్నట్లుగా చెప్పారు. ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో చేసిన అభివృద్ధిపై, రేవంత్ రెడ్డి సర్కారు చేపట్టిన పథకాల అమలుపై ఈరవత్రి అనిల్ సుదీర్ఘంగా ప్రసంగించారు. ఒక దశలో భావోద్వానికి గురయ్యారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఈరవత్రి అనిల్ గెలిచి అనంతరం కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకపోయినప్పటికీ రేవంత్ రెడ్డి సర్కారు కొలువు దీరిన తర్వాత ఖనిజాభివృద్ధి సంస్థకు చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు.

**మంత్రి లేక... గౌరవం దక్కక...**

నిజామాబాద్ జిల్లాలో బోధన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. ఇందులో సీనియర్ శాసనసభ్యుడిగా, మాజీ మంత్రిగా అపార అనుభవం కలిగిన సుదర్శన్ రెడ్డి ఉన్నారు. ఆది నుంచి ఉమ్మడి జిల్లా కోటాలో మంత్రి పదవి దక్కుతుందని సుదర్శన్ రెడ్డి ఆశలు పెట్టుకున్నారు. ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ మంత్రి పదవి ఊసే లేదు. ఆషాఢం పేరిట వాయిదా వేసిన ప్రక్రియ కాస్తా శ్రావణమాసం వచ్చినప్పటికీ ఉలుకూ పలుకూ లేకుండా పోయింది. ఓ వైపు మంత్రి పదవి రాలేదన్న బాధ వెంటాడుతున్న క్రమంలో పంద్రాగస్టు వేడుకల్లో జెండా ఆవిష్కరణలోనూ చోటు లేకపోవడంతో సుదర్శన్ రెడ్డి వర్గీయులు, ఆయన అనుచరుల్లో ఒకింత అసంతృప్తి వెలుగు చూస్తున్నది. నిజామాబాద్ పరేడ్ మైదానంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు అంగరంగ వైభవంగా జరిగితే ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి రాకపోవడం చర్చకు తావిచ్చినట్లైంది. పంద్రాగస్టు వేడుకల్లో బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తాతోపాటు లోక్‌సభ సభ్యుడు ధర్మపురి అర్వింద్ హాజరవ్వడం విశేషం. జెండా ఆవిష్కరణ అనంతరం ముఖ్య అతిథి ప్రసంగం మొదలు కాగానే బీజేపీ నేతలంతా నిష్క్రమించడం కనిపించింది.



ఖలీల్‌వాడి, ఆగస్టు 15: నిజామాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన స్వాతం త్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

# సబ్ స్టేషన్ ముట్టడి

రామారెడ్డి, ఆగస్టు 15: పంటల సాగుకు విద్యుత్ అంతరాయం ఏర్పడడాన్ని నిరసిస్తూ సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన ఘటన సదాశివనగర్ మండలం పద్మాజీవాడిలో గురువారం చోటు చేసుకున్నది. మోడేగామ గ్రామానికి చెందిన రైతులు సుమారు 60మంది సబ్‌స్టేషన్‌కు తరలివచ్చారు. పంటల సాగుకు ఇష్టానుసారంగా, సమాచారం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నారని, గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ కొన్ని రోజుల నుంచి మొరాయిస్తుందని లైన్‌మన్‌కు తెలిపినా స్పందించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యుత్ సమస్యలపై సబ్‌స్టేషన్‌లో పనిచేసే ముగ్గురు ఆపరేటర్లకు ఫోన్ చేస్తే.. వారు స్విచ్ఛాఫ్ చేసి పెడుతున్నారని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న ఏఈ ధర్మారెడ్డి సబ్‌స్టేషన్‌కు చేరుకొని రైతులతో మాట్లాడారు. సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని, రైతుల ఫోన్ లిఫ్ట్ చేయని విద్యుత్ సిబ్బందిపై ఏఈ ఆగ్రహం వ్యక్తంచేశారు. సిబ్బంది తీరు మార్చుకోవాలని లేదంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఏఈ ధర్మారెడ్డి హెచ్చరించారు. ఏఈ సముదాయించడంతో రైతులు శాంతించారు.



సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

# అడ్డొస్తే చంపేస్తాం..

- ఇసుక మాఫియా బెదిరింపులు
- తహసీల్దార్, పోలీసులకు వీఆర్ఏల ఫిర్యాదు



బిచ్కుంద సీఐ జగడం నరేశ్‌కు ఫిర్యాదు చేస్తున్న వీఆర్ఏలు

బిచ్కుంద, ఆగస్టు 15: ఇసుక తరలింపును అడ్డుకుంటే చంపేస్తామని బెదిరిస్తున్నారని వీఆర్ఏలు బిచ్కుంద సీఈ జగడం నరేశ్, ఎస్సై మోహన్‌రెడ్డితోపాటు తహస్దీలార్ సురేశ్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. మండలంలోని మంజీరా పరీవాహక ప్రాంతాలైన ఖత్‌గావ్, శెట్లూర్, హస్గుల్, పుల్కల్ గ్రామాల నుంచి ప్రతి రోజూ వందల ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమంగా రవాణా జరుగుతున్నది. దీంతో రెవెన్యూ అధికారులు హస్గుల్ మంజీరా ప్రాంతంలో చెక్‌పోస్టును ఏర్పాటుచేశారు. ఇసుక రవాణాకు అడ్డువస్తే ట్రాక్టర్లతో ఢీకొట్టి చంపేస్తామని ట్రాక్టర్ డ్రైవర్లు అక్కడ విధులు నిర్వహిస్తున్న వారిని బుధవారం హెచ్చరించారు. ఈ విషయమై గురువారం వారు బిచ్కుంద తహసీల్దార్‌తోపాటు సీఐ, ఎస్సైలకు ఫిర్యాదుచేశారు. తాము అధికారుల ఆదేశాల మేరకు విధులు నిర్వహిస్తున్నామని, పదిహేను మంది వరకు వచ్చి ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు ప్రాణహాని ఉన్నదని, బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకొని తమకు తగిన న్యాయం చేయాలని కోరారు. బెదిరింపులకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ నరేశ్ వారికి హామీ ఇచ్చారు.

